వృథాగా నీటితొట్లు

- దాహార్తితో అల్లాడుతున్న పశువులు
- నీటి కోసం చెరువులు, కుంటలకు పరుగు
- నీటితొట్లు ఏర్పాటు చేసినా నీరులేదు

ఉండవెల్లి: మూగజీవాల దాహార్తి తీర్చేందుకు నియోజవర్గంలోని గ్రామాల్లో జాతీయ ఉపాధిహామీ పథకం నిధులతో నీటితొట్లు నిర్మించారు. వేసవిలో పశువులకు నీటితొట్లను ఏర్పాటు చేయాలనే లక్ష్యంతో నిర్మించగా, వాటి నిర్వహణ సరిగ్గా లేక నిరుపయోగంగా మారాయి. పంచాయతీల ఆధ్వర్యంలో కొనసాగే మోటారు బావుల నుంచి పశువుల నీటి తొట్లకు నీటిని సరఫరా చేయాల్సి ఉండగా పట్టించుకునే నాథుడు కరువయ్యారు. పశువులు దాహం తీర్చుకునేందుకు పడరాని పాట్లు పడుతున్నాయి. గ్రామాల్లో నీటితొట్లు ధ్వంసమై శిథిలావస్థకు చేరాయి. పశువులకు దాహం తీర్చుకునేందుకు చెరువులు, కుంటలకు వెళ్లాల్సి వస్తోంది.

అధికారులు దృష్టిపెట్టాలి..

ప్రభుత్వం పశువుల సంరక్షణకు ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెడుతున్నప్పటికీ సంబంధిత అధికారుల నిర్లక్ష్యంతో అవి నీరు గారుతున్నాయనే విమర్శలు వస్తున్నాయి. వేసవి సమీపిస్తున్న నేపథ్యంలో గ్రామాల్లో ఉన్న చెరువులు, కుంటల్లోని నీరు ఎండవేడిమికి అడుగంటిపోతున్నాయి. లక్షల రూపాయలు వేచించి నిర్మించిన తొట్లను వృథాగా వదిలేయడంతో పశువుల దాహార్తి తీరక ప్రజల ధనం వృథా అవుతోంది.

నీరందక ఇబ్బందులు..

గ్రామాల్లో గొర్రెలు, మేకలు, పశువులు, ఇతర జీవాల కాపర్లు నీటితొట్లపై ఆధారపడుతున్నారు. వ్యవసాయ పొలాల వద్ద నీరు అందుబాటులో ఉండదు. ప్రస్తుతం ఎండతీవ్రత పెరగడంతో నీటిమట్టం తగ్గుతోంది. పశువులకు నీటితొట్ల ద్వారా నీరందించాలని పాడైన నీటితొట్లకు మరమ్మతు చేయాలని పెంపకందారులు కోరుతున్నారు.


ఉండవెల్లిలో నీటితొట్టి లేక నీటికోసం చెరువుకు తీసుకెళ్లిన గేదెలు


బస్వాపురంలో నిరుపయోగంగా నీటితొట్టి

నీటితొట్లలో నీరు నింపాలి..


గ్రామాల్లో ఉన్నా అవి నిరుపయోగంగా ఉన్నాయి. పంచాయతీ అధికారులు వాటిల్లో నీటిని నింపి పశువుల దాహం తీర్చాలి. ఎండలు ముదిరాయి. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి.
– ఉపేంద్ర, రైతు, ఉండవెల్లి

నీటితొట్లను ఉపయోగించాలి..

గ్రామాల్లో ఉన్న నీటితొట్లను ఉపయోగించాలి. వా టిని పరిశీలించి పశువుల దాహం తీర్చేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటాం. ఎండలు ముదురుతున్న తరుణంలో వాటికి నీటి సౌకర్యం కల్పించి వినియోగంలోకి తెస్తాం.
– పద్మావతి, ఎంపీడీఓ, ఉండవెల్లి

క్లుప్తంగా

ఎలక్టోరల్ బాండ్ల వివరాలు బహిర్గతం చేయాలి



ఉండవెల్లి: సీపీఎం కేంద్ర కమిటీ పిలుపు మేరకు ఎలక్టోరల్ బ్యాంక్ బాండ్ల వివరాలను బహిర్గతం పరచాలని డిమాండ్ చేస్తూ మండల కేంద్రంలోని ఎస్‌బీఐ బ్యాంక్ ముందు నిరసన చేపట్టారు. సోమవారం సీపీఎం మండల కార్యదర్శి మద్దిలేటి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీరు ఎలక్టోరల్ బాండ్ల వివరాలు వెల్లడించకుండా ఎస్‌బీఐపై ఒత్తిడి తీసుకొస్తుంద ని, వెంటనే వాటిని వెల్లడించాలని డిమాండ్ చేశారు. లేదంటే దేశవ్యాప్త సమ్మెకు పిలుపునిస్తామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు మద్దిలేటి, వెంకటేశ్వర్లు, సుంకన్న, నాగన్న, సూరిబాబు, తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో భజన



శాంతినగర్: కొంకలలోని నీలకంఠేశ్వరస్వామి ఆలయంలో భక్తులు భక్తి శ్రద్ధలతో భజన చేశారు. వడ్డేపల్లి మండలంలోని కొంకలలో వెలసిన నీలకంఠేశ్వరస్వామి భక్త బృందం సభ్యులు గతంలో శివమాలలు వేశారు. శివరాత్రి వరకు మాలలు ధరించి ఇటీవల శ్రీశైలంలో మాలలు తీశారు. గ్రామం చేరుకున్న భక్తులు సోమవారం పర్వదినాన్ని పురస్కరించుకుని ఆలయంలో భజన చేశారు. భక్తులు ఆలపించిన శివనామస్మరణ గ్రామంలో మార్మోగింది.

ఘనంగా స్వపరిపాలన దినోత్సవం



కేటీదొడ్డి: మండలంలోని పాగుంట పాఠశాలలో సోమవారం స్వయంపరిపాలన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం స్వాతి, శ్వేత, రాకేష్, రఘు, పారిజాత ఉన్నారు.

పోలింగ్‌బూత్ సమ్మేళనం విజయవంతం చేయండి

శాంతినగర్: బీజేపీ ఆధ్వర్యంలో మంగళవారం హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియంలో నిర్వహించనున్న పోలింగ్‌బూత్ సమ్మేళనానికి పోలింగ్‌బూత్ అధ్యక్షులతో పాటు ఆపై స్థాయి నాయకులు హాజరై విజయవంతం చేయాలని ఆ పార్టీ వడ్డేపల్లి మున్సిపాలిటీ ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమ్మేళనానికి కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షాలు హాజరవుతున్నట్లు తెలిపారు. నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని కోరారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత



గట్టు: మండలంలోని బల్గెర గ్రామ శివారులో అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను సోమవారం పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రామకృష్ణ తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాల ప్రకారం.. బల్గెరకు చెందిన సర్వేష్, బత్తలయ్యలు అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తుండగా పెట్రోలింగ్ నిర్వహిస్తున్న కానిస్టేబుళ్లు నాగరాజు, హరికుమార్ ట్రాక్టర్‌ను పట్టుకున్నారు. ఎలాంటి అనుమతి లేకపోవడంతో ట్రాక్టర్‌ను పోలీస్ స్టేషన్‌కు తరలించి, కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

కాంగ్రెస్ పాదయాత్రకు తరలిరండి

ఎర్రవల్లిచౌరస్తా: పార్లమెంట్ ఎన్నికల్లో అత్యధిక సీట్లను గెలుపొందడం కోసం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం వనపర్తి జిల్లా కేంద్రంలో చేపట్టే పాదయాత్రకు పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో తరలి రావాలని ఎర్రవల్లి మండలాధ్యక్షుడు వెంకటేష్ యాదవ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి ఏఐసీసీ కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్ హాజరవుతారని, మండలంలోని కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో హాజరై పాదయాత్రను విజయవంతం చేయాలని ఆయన కోరారు.

నర్సరీల పరిశీలన

మానవపాడు: మండలంలోని ఆయా గ్రామాలలో నర్సరీలను ఎంపీడీఓ ఆంజనేయరెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నర్సరీలలో మొక్కలకు కావల్సిన నీటి సదుపాయలను అందించాలని తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది తెలిపారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు


మాట్లాడుతున్న తహసీల్దార్ జ్యోతి

అయిజ: రెవెన్యూకు సంబంధించిన సమస్యలను సంబంధిత అధికారులు ఎప్పటికప్పుడు పరిష్కరించాలని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చర్యలు తప్పవని తహసీల్దార్ జ్యోతి హెచ్చరించారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ అధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. బాధితుల సమస్యలు పరిష్కరించేందుకు నేరుగా దరఖాస్తుదారులు, బాధితులతో మాట్లాడాలని, పైరవీకారులను రానివ్వకూడదని సలహాలు, సూచనలు చేశారు. స్పెషల్ డ్రైవ్‌లో వచ్చిన దరఖాస్తులన్నింటి పరిష్కారానికి కృషిచేస్తున్నామని, కొన్ని ఆర్డీఓ లాగిన్‌లో, మరికొన్ని కలెక్టర్ లాగిన్‌లో ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌ఐలు, జూనియర్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

పోటాపోటీగా భజన పోటీలు


బహుమతులను ప్రదానం చేస్తున్న నాయకులు

ఎర్రవల్లిచౌరస్తా: ఎర్రవల్లి మండలంలోని వేములలో మహాశివరాత్రి సందర్భంగా నిర్వహించిన అంతరాష్ట్ర భజన పోటీలు సోమవారం అట్టహాసంగా ముగిశాయి. ఈ పోటీల్లో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన మొత్తం 17 టీమ్‌లు పాల్గొని పోటాపోటీగా తమ గాన స్వరాలతో భజన నిర్వహించారు. పోటీల్లో మొదటి బహుమతి రూ.30వేలు మందాపురం, రెండో బహుమతి రూ.25వేలు గుర్రప్పాడు, మూడో బహుమతి రూ.20వేల కందికాయపల్లె, నాల్గవ బహుమతి రూ.15వేలు గార్లదిన్నె, ఐదో బహుమతి రూ.12వేలు శంకరాపురం, ఆరో బహుమతి రూ.10వేలు లక్ష్మీపల్లి గ్రామాల టీమ్‌లు కైవసం చేసుకున్నాయి. పోటీల్లో గెలుపొందిన టీమ్ సభ్యులను దాతలు, గ్రామ పెద్దలు అభినందించి శాలువాలతో సత్కరించి నగదును అందజేశారు. కార్యక్రమంలో నీలి శ్రీనివాసులు, పెద్ద గోవిందు, వెంకటేష్, మహేష్, లక్ష్మన్న, శ్యామ్, శేఖర్, సురేష్, రాజేష్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఆదిశిలా క్షేత్రంలో ప్రత్యేక పూజలు


గురుమాత విజయలక్ష్మిని సన్మానిస్తున్న ఆలయ చైర్మన్ ప్రహ్లాదరావు

మల్దకల్: ఆదిశిలా క్షేత్రమైన స్వయంభూ లక్ష్మీవేంకటేశ్వరస్వామి వారిని సోమవారం నాగర్‌కర్నూల్ లక్ష్మీనరసింహస్వామి దేవాలయం గురుమాత విజయలక్ష్మి దంపతులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ ప్రహ్లాదరావు అర్చకులు మధుసూదనాచారి, రవిచారి, ఆమెకు స్వాగతం పలికారు. అర్చకులు ఆలయ విశిష్టతను వివరించి స్వామి వారి తీర్థ ప్రసాదాలు ఆమెకు అందజేశారు. శేషవస్త్రంతో సత్కరించి స్వామి వారి మెమోంటోను చైర్మన్ అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ సత్యచంద్రారెడ్డి, అర్చకులు, సిబ్బంది ఉన్నారు.

విద్యార్థుల మెటీరియల్ అందజేత


విద్యార్థులకు మెటీయల్‌ను అందజేస్తున్న హెచ్‌ఎం నారాయణరావు

ధరూరు: మండలంలోని ఉప్పేరు ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు భౌతిక రసాయన శాస్త్రం నుంచి మినిమం లర్నింగ్ అకాడమీ స్టాండర్డ్స్(ఎంఎల్ఎస్–2024)లో భాగంగా విద్యార్థుల కోసం తయారు చేసిన మెటీరియల్‌ను పాఠశాల ప్రధానోపాధ్యాయులు నారాయణరావు అందజేశారు. 40 మార్కులకు గాను కనీసం 20 మార్కులు వచ్చే విధంగా ఉపాధ్యాయులు సాయి సుధాకర్ తయారు చేసిన మెటీరియల్‌ను అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు గౌరీశంకర్, ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు దుస్తుల పంపిణీ


క్రీడాకారులకు దుస్తులు పంపిణీ చేసిన గోపాల్

అయిజ: సింధనూరులో నిర్వహిస్తున్న భ్రామరి సహిత మల్లికార్జున స్వామి జాతర సందర్భంగా మండలంలోని సింధనూరులో సోమవారం క్రీడాకారులకు బీజేపీ మండల కార్యవర్గ సభ్యులు గోపాల్ క్రీడా దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గోపాల్ మాట్లాడారు. క్రీడాకారులు ప్రతి రోజు సాధన చేయాలని, క్రీడా పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని కోరారు.

పౌష్టికాహారం పంపిణీలో అలసత్వం వద్దు

మల్దకల్: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలకు అందిస్తున్న పౌష్టికాహారం పంపిణీలో అలసత్వం వహించే వారిపై చర్యలు తప్పవని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ నాగరాణి హెచ్చరించారు. సోమవారం మండలంలోని మూడు అంగన్‌వాడీ కేంద్రాలను ఆమె ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయా అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అందిస్తున్న పౌష్టికాహారానికి సంబంధించిన రికార్డులను ఆమె పరిశీలించారు. ఎత్తు, బరువు తక్కువ ఉన్న చిన్నారుల ఆరోగ్యంపై తీసుకుంటున్న జాగ్రత్తలను అంగన్‌వాడీ కార్యకర్తలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, తదితరులు పాల్గొన్నారు.

శివాలయంలో ప్రత్యేక అభిషేకాలు



ఎర్రవల్లిచౌరస్తా: బీచుపల్లి పుణ్యక్షేత్రంలోని శివాలయంలో సోమవారం భక్తులు ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. చుట్టు పక్కల ప్రాంతాల నుంచి భక్తులు బీచుపల్లి క్షేత్రానికి చేరుకొని శివాలయంలో పూజలు చేశారు. శివునికి పంచామృత అభిషేకాలు నిర్వహించి మొక్కులను తీర్చుకున్నారు.

రైతులకు సూచనలు

మానవపాడు: మండలంలోని ఆయా గ్రామాలలో రైతులకు సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ గోపి ఐఏఎస్ ఆధ్వర్యంలో మామిడలలో చీడ పీడల అధిక ఉష్ణోగ్రత వద్ద మామిడలో జరిగిన నష్టాలు, సేంద్రియ వ్యవసాయంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెడ్ ఆఫ్ ఫ్రూట్ రిసోర్స్ స్టేషన్ సంగారెడ్డి, డా. జి శ్రీనివాస్ మెడ్ ఆప్ ఫ్రూట్ డైరెక్టర్ ఆఫ్ రిసెర్చ్, ప్రగతికుమారి సైంటిస్ట్ రైతులకు సలహాలు, సూచనలు అందించారని రైతులు పాటించాలని తెలిపారు.

గర్భిణులు వైద్యపరీక్షలు చేయించుకోవాలి

మల్దకల్: మండలంలోని వివిధ గ్రామాల్లోని గర్భిణులు, బాలింతలు నెలనెల తప్పనిసరిగా వైద్యపరీక్షలు చేయించుకోవాలని డాక్టర్ స్వరూపారాణి సూచించారు. సోమవారం ఆమె గర్భిణులు, బాలింతలకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. నెలనెలా వైద్యపరీక్షలు చేయించుకునేలా అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాలు చేయించుకోవడం సురక్షితమన్నారు. పోషకాలు ఎక్కువగా ఉండే పౌష్టికాహారం తీసుకోవడం ద్వారానే తల్లీబిడ్డ ఆరోగ్యంగా ఉంటారన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ శ్రీధర్, ఏఎన్‌ఎంలు ఆశాలు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శికి సన్మానం

ఎర్రవల్లిచౌరస్తా: ఎర్రవల్లి గ్రామ పంచాయతీ నూతన కార్యదర్శిగా సోమవారం రంగన్న బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా అలంపూర్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు జోగుల రవి ఆధ్వర్యంలో కార్యదర్శికి పూలమాల, శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో నాయకులు బీచుపల్లి, శాంతన్న, తదితరులు ఉన్నారు.

వ్యక్తి మృతి : కేసు నమోదు

ఉండవెల్లి: గుండెపోటుతో వ్యక్తి మృతి చెందిన ఘటన సోమవారం మండలంలోని అలంపూర్ చౌరస్తాలో చోటు చేసుకుంది. ఆయన కుమారుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు. హెడ్‌కానిస్టేబుల్ ప్రసాద్ వివరాల మేరకు.. హైదరాబాద్‌కు చెందిన సయ్యద్ నూరుల్ అంబియ్యా(55) వడ్డేపల్లి మండలం పాలిటెక్నిక్ కళాశాలలో హాస్టల్ సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్నాడు. సోమవారం హైదరాబాద్ నుంచి బస్సులో అలంపూర్ చౌరస్తాకు వచ్చాడు. కళాశాలకు అరగంటలో వస్తానని జూనియర్ అసిస్టెంట్ నాగరాజుకు ఫోన్‌చేసి చెప్పాడు. అంతలోనే షుగర్ పెరిగి కళ్లు తిరుగుతుండగా, డయాగ్నోస్టిక్ సెంటర్‌లో పరీక్షలు నిర్వహించారు. బెంచిపై పడుకున్న ఆయనకు గుండెనొప్పి రావడంతో 108కు సమాచారం ఇచ్చారు. అంబులెన్స్ వచ్చేలోపు మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. వెంటనే కళాశాల జూనియర్ అసిస్టెంట్ నాగరాజు అక్కడికి వచ్చి కుటుంబ సభ్యులకు, పోలీసులకు సమాచారం ఇచ్చాడు. అనంతరం అలంపూర్ ఆస్పత్రికి మృతదేహాన్ని తరలించారు. కుమారుడు సయ్యద్ నూరుల్ రెహ్మాన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

బీఆర్‌ఎస్ నాయకులకు దిశా నిర్దేశం


ఎమ్మెల్సీ చల్లాను సన్మానిస్తున్న నాయకులు

అయిజ: రానున్న స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక, ఎంపీ ఎన్నికలకు సంబంధించి బీఆర్‌ఎస్ నాయకులకు, కార్యకర్తలకు ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి దిశా నిర్దేశం చేశారు. సోమవారం మండల కేంద్రంలో ఎంపీటీసీలు, మున్సిపల్ కౌన్సిలర్లతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. త్వరలో నిర్వహించనున్న సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, మున్సిపల్ కౌన్సిలర్ల ఎన్నికల్లో ఎంపీటీసీలు, మున్సిపల్ కౌన్సిలర్లు, మాజీ సర్పంచ్‌లు క్రియాశీలక పాత్ర పోషించాలని పలు సలహాలు, సూచనలు చేశారు. తిక్కవీరేశ్వర స్వామి ఆలయంలో ఎమ్మెల్సీ చల్లా ప్రత్యేక పూజలు చేయించారు. ఎమ్మెల్సీని ఆలయ కమిటీ సభ్యులు శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు, కార్యర్తలు పాల్గొన్నారు.

తిక్కవీరేశ్వర స్వామి హుండీ లెక్కింపు


ఆలయంలో హుండీ లెక్కిస్తున్న కమిటీ సభ్యులు

అయిజ: మండల కేంద్రంలోని తిక్క వీరేశ్వర స్వామి ఆలయంలో సోమవారం ఆలయ కమిటీ సభ్యులు హుండీ లెక్కింపు నిర్వహించారు. తిక్క వీరేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన హుండీలో భక్తులు రూ.1.21 లక్షలు నగదును సమర్పించినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. బ్రహ్మోత్సవాల ముగింపు సందర్భంగా రాత్రి తిక్క వీరేశ్వర స్వామి ఉత్సవ విగ్రహాన్ని మేళ తాళాలతో, మంగళ వాయిద్యాలతో ఆలయ అర్చకుడు లక్ష్మీరెడ్డి ఇంటి వరకు ఊరేగించారు. యువకులు నందికోళ్ల సేవ నిర్వహించారు. మహిళలు మంగళ హారతులు పట్టారు.

రాజ్యాంగం ప్రమాదంలో ఉంది


మాట్లాడుతున్న పార్లమెంట్ ఇన్‌చార్జి కేశవరావు

అలంపూర్: డా.బీఆర్ అంబేద్కర్ రాసిన రాజ్యాంగం బీజేపీ, కాంగ్రెస్ పార్టీల వల్ల ప్రమాదంలో ఉందని బీఎస్పీ నాగర్‌కర్నూల్ పార్లమెంట్ ఇన్‌చార్జి కేశవరావు అన్నారు. సోమవారం అలంపూర్ చౌరస్తాలోని బీఎస్పీ కార్యాలయంలో మాట్లాడారు. నాగర్‌కర్నూల్ పార్లమెంట్‌లో నీలిజెండాను ఎగురవేస్తాం అని తెలిపారు. నాగర్‌కర్నూల్ నుంచి విద్యావంతుడు, డా.ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను పార్లమెంట్‌కు పంపించాలని కోరారు. కార్యక్రమంలో బీఎస్పీ నాయకులు కనకం బాబు, రామ్‌ప్రసాద్ రెడ్డి, మధుగౌడు, సురేష్, ప్రభుదాస్, లక్ష్మణ్, నాగరాజు, అయ్యన్న తదితరులు పాల్గొన్నారు.

పశుసంపదను వృద్ధి చేసుకోండి


గేదెకు టీకా వేస్తున్న వైద్య సిబ్బంది

శాంతినగర్: పశువులకు సోకే వివిధ వ్యాధులకు సంబంధించి ముందస్తు టీకాలు వేయించి పశు సంపదను వృద్ధి చేసుకోవాలని డాక్టర్ పుష్పలత అన్నారు. వడ్డేపల్లి మండలంలోని జూలెకల్‌లో ఎద్దులు, ఆవులు, గేదెలకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. గ్రామంలోని 21 మంది రైతులకు చెందిన 182 పశువులకు టీకాలు వేసినట్లు డాక్టర్ తెలిపారు. ఉచితంగా వేస్తున్న టీకాలను పశువులకు వేయించి పశుసంపదను కాపాడుకోవాలని పేర్కొన్నారు.

అయిజ: పశువుల్లో థైలెరియోసిస్ రాకుండా రో గనిరోధక టీకాలు వేయించాలని వెటర్నరీ అ సిస్టెంట్ సర్జిన్ స్వరూపారాణి కోరారు. వ్యాధి ని అరికట్టేందుకు ప్రభుత్వం ఉచితంగా టీకా లు అందజేస్తుందన్నారు. మండలంలోని సంకాపురంలో పశువులకు వెటర్నరీ సిబ్బంది వ్యాక్సిన్ వేశారు. ఈ సందర్భంగా వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ మాట్లాడారు. మొత్తం 135 పశువులకు వ్యాక్సిన్ వేసినట్లు తెలిపారు. రైతులకు ఎలాంటి అనుమానాలున్నాసరే పశు వైద్య శాలలో సంప్రదించి వివరాలు తెలుసుకోవాలని సూచించారు.

తారు రోడ్డే ఇది!

- గుంతల్లో మట్టి నింపిన వైనం


గట్టు తహసీల్దార్ కార్యాలయం సమీపంలో తారు రోడ్డుపై వేసిన మట్టి

గట్టు: మండలంలోని తారురోడ్లు చాలా కాలం తర్వాత మట్టి రోడ్లను తలిపిస్తున్నాయి. భారీ వాహనాల రాకపోకల కారణంగా తారురోడ్లు దెబ్బతిన డంతో రోడ్లపై గుంతలు ఏర్పడ్డాయి. గుంతలను పూడ్చే క్రమంలో తారు రోడ్డుపై మట్టిని వేయడంతో తారురోడ్లు మట్టి రోడ్ల మాదిరిగా కన్పిస్తున్నాయి. రాయాపురం స్టేజీ నుంచి మాచర్ల వరకు ఉన్న తారు అధ్వానంగా మారింది. ఎన్నో ఏళ్ల క్రితం వేసిన తారురోడ్డు మరమ్మతులకు నోచుకోక పోవడంతో ప్రస్తుతం తిరుగుతున్న భారీ వాహనాల వల్ల పూర్తిగా దెబ్బతింది. తారు రోడ్డుపై ప్రయాణం నరకంగా మారినట్లు వాహనదారులు వాపోతున్నారు. గట్టు నుంచి మాచర్ల వరకు ఉన్న 5 కిలోమీటర్ల తారు రోడ్డు భారీ వాహనాల రాకపోకల కారణంగా రోడ్డు దిగబడి పోయి గుంతలు ఏర్పడ్డాయి. గుంతలు ఏర్పడిన చోట మట్టిని వేశారు. చూసే వారికి ఇది తారు రోడ్డా లేక మట్టి రోడ్డా అనే అనుమానం కలుగక మానదు. భారత్‌మాల జాతీయ రహదారి పనులతో పాటుగా గజ్జలమ్మగట్టు ప్రాజెక్టు పనుల కోసం నిత్యం కంకర, మట్టి, ఒండ్రు మట్టి, ఇసుకను భారీ వాహనాల్లో తరలిస్తుంటారు. భారీ వాహనాల కారణంగా రోడ్డు ఛిద్రమైనట్లు వాహనదారులు పేర్కొన్నారు. రోడ్ల పక్కన సాగు చేసిన పంటలపై దుమ్ము, ధూళి పేరుకు పోయి పంటలు దెబ్బతింటున్నట్లు రైతులు వాపోతున్నారు. నిత్యం అనేక వాహనాలు రోడ్లపై తిరుగుతూ దుమ్ములేపుతున్నాయని, దుమ్ము కారణంగా పంటలు దెబ్బతింటున్నట్లు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రోడ్లను బాగు చేసి, దుమ్ము, ధూళి లేవకుండా చర్యలు తీసుకోవాలని రైతులు, వాహన దారులు కోరుతున్నారు.

భక్తిశ్రద్ధలతో పరమేశ్వరస్వామి జాతర

- శివనామస్మరణతో పులకించిన ఆత్మకూర్
- స్వామివారికి దాసంగాలు పెట్టి మొక్కులు


దాసంగాలు తయారు చేస్తున్న భక్తులు


రథంపై కొలువుదీరిన స్వామివారు

ఆత్మకూర్: పట్టణంలోని చెరువు మధ్యలో వెలసిన స్వయంభూ పరమేశ్వరస్వామి ఉత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి భక్తిశ్రద్ధలతో పూజలు, రథోత్సవాన్ని నిర్వహించారు. ఉదయం స్వామివారికి రుద్రాభిషేకం చేసి ఉత్సవమూర్తి విగ్రహాలను ఆలయంలోని శివలింగంపై అలంకరించారు. వందలాదిమంది భక్తులు బక్షాలు, పచ్చిపులుసు, అన్నాన్ని స్వామివారికి నైవేద్యంగా సమర్పించి దాసంగాలు పెట్టారు. అనంతరం ప్రముఖ పూజారులు కర్పసయ్య ఆధ్వర్యంలో జాతర కమిటీ కన్వీనర్ రవికుమార్‌యాదవ్, మున్సిపల్ చైర్‌పర్సన్ గాయత్రి, కౌన్సిలర్లు చెన్నయ్య, మండ్లరామకృష్ణ, పోశన్న, అశ్విన్‌కుమార్, మహేశ్వరి, నాగలక్ష్మి, యాదమ్మ, తబస్సుం ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. రాత్రి వేంకటేశ్వరస్వామి ఆలయం నుంచి మొదలుకుని పట్టణంలోని పురవీధుల గుండా స్వామివారికి మేళతాళాలతో పల్లకీసేవ చేపట్టారు. అనంతరం పల్లకీసేవను ఆలయానికి చేర్చి పూజలు నిర్వహించారు. రాత్రి రథోత్సవంపై పరమేశ్వరస్వామి విగ్రహాలు ఉంచి రథోత్సవాన్ని నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి భక్తులు వేలాదిగా తరలివచ్చారు. బుధ, గురువారం రాత్రి తేరు సందర్భంగా ప్రత్యేక పూజలు, ఇతర కార్యక్రమాలు చేపడుతున్నట్లు నిర్వాహకులు తెలిపారు.


రథోత్సవంలో పాల్గొన్న భక్తులు